క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కొండపి: గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. గురుకులంలో విద్యా అర్హత పొందేందుకు విద్యార్థులు ఆన్‌లైన్ మార్చి 6వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 6న నిర్వహించే రాత పరీక్షలో వచ్చిన ఫలితాల ఆధారంగా గురుకులంలో ప్రవేశించవచ్చని ప్రకటనలో కోరారు.

రైతు గుర్తింపు సంఖ్య పొందాలి

కొండపి: మండలంలోని ప్రతి రైతూ రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.విజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య యూనిక్ ఐడీ, ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందిస్తుందని, సొంత భూములు కలిగిన ప్రతి రైతు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు రైతులు పొందాలంటే తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని ప్రతి ఒక్క రైతు మీ సంబంధిత రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద మీకు సంబంధించిన పొలం వివరాలు, ఆధార్ కార్డు, మీ ఫోన్ నంబర్ ఇచ్చి రైతు గుర్తింపు రిజిస్టర్ సంఖ్యను పొందాలని ఏవో రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలు పొందాలంటే రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి అన్ని వివరాలు వీఏఏలకు అందించి గుర్తింపు సంఖ్య తీసుకోవాలని కోరారు.



అధ్వానంగా దర్శనమిస్తున్న వీ బైలురోడ్డు



వీ బైలు సమీపంలో గుంతలుగా ఉన్న రోడ్డు

గుంతలమ్మా.. గుంతలూ

మనం కేవలం మాటలు చెప్పే ప్రభుత్వాన్ని చూస్తున్నాం.. తప్పా చేతల ప్రభుత్వాన్ని చూడటం లేదు. అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తీరా వచ్చాక నాలుక మడతపెట్టేసింది. సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు చూస్తారంటూ సాక్షాత్తు సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు వట్టి మూటలేనని మరోసారి నిరూపితమైంది.

- సీఎస్‌పురం మండలంలో గుంతలమయంగా గ్రామీణ రోడ్లు
- కనీస మరమ్మతులు చేయని దుస్థితి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వాహనదారుల తీవ్ర ఇక్కట్లు

సీఎస్‌పురం(పామూరు): గ్రామీణ, పట్టణ రహదారులు ప్రగతికి చిహ్నాలు, రోడ్డు వ్యవస్థ పటిష్టంగా ఉంటే ఆర్థిక వ్యవస్థ అంత బలోపేతంగా ఉంటుంది. అభివృద్ధి చెందిన రహదారులు ఉన్న ప్రాంతాల్లో విద్య, వ్యవసాయ, పారిశ్రామిక, ముడిసరుకులు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు ఎగుమతులు, దిగుమతులు సులభతరమై ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడేందుకు ఎంతో దోహదంగా ఉంటుంది. ఇదంతా చెప్పుకోవడానికి బాగున్నా ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు గోతుల మయంగా అడుగుకో గుంత ఉండటంతో ఏ క్షణంలో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో అన్న చందాన గుంతలతో నిండి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మండల కేంద్రం సీఎస్‌పురం నుంచి కోవిలంపాడుకు వెళ్లే రహదారి డబుల్ రోడ్డు సైతం సీఎస్‌పురంలోని పెట్రోల్ బంక్ సమీపంలో గుంతలతో నిండి ప్రమాదకరంగా ఉంది. అదే విధంగా సీఎస్‌పురం నుంచి డీజీపేట వైపు 167–బీ జాతీయ రహదారి వరకు వెళ్లే రోడ్డు సైతం గుంతలతో నిండి ఉంది. ఇక మండలంలోని గణేషునిపల్లె నుంచి చెన్నపునాయునిపల్లె, వీ బైలు, వెళ్లేరోడ్డు గుంతలతో ఉండగా ఆ రోడ్డుపై ప్రయాణం పాదచారులకు, ద్విచక్రవాహనదారులకు, స్కూల్ బస్‌లకు, ఇతర వాహనదారులకు నరకప్రాయాన్ని చూపుతోంది.

విద్యార్థుల కష్టాలు చెప్పలేనివి..

వీ బైలు, చెన్నపునాయునిపల్లె గ్రామాలకు చెందిన విద్యార్థులు అంబవరం హైస్కూల్‌కు, సీఎస్‌పురంలోని జూనియర్ కళాశాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుండగా వారు పడే బాధలు అన్నీఇన్నీ కావు. అదేవిధంగా రేగులచెలక గ్రామం నుంచి గుంతచెన్నంపల్లెకు వెళ్లే రోడ్డు మొత్తం సుమారు 6 కిలోమీటర్లలో 2.5 కి.మీ తారురోడ్డు వేసేందుకు మొదలు పెట్టి కంకర తోలగా రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అదేవిధంగా మిగిలిన మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు బాధలు అన్నీఇన్నీ కావు. అదేవిధంగా ఉప్పలపాడు నుంచి సీఎస్‌పురానికి వెళ్లే తారురోడ్డు కూడా పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణం కష్టంగా ఉంది. పాలకులు, అధికారులు తక్షణం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 8 మాసాలు కావస్తున్నా నేటికి కనీసం అధ్వానంగా ఉన్నా కనీస మరమ్మతులు చేపట్టి ప్రజల కష్టాలు తీర్చలేకపోవడం విడ్డూరంగా ఉంది. పాలకులు తక్షణం యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూసి, తమ కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజల కష్టాలు తీర్చాలి..

గుంతల రోడ్లతో ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు, పొలాల్లోకి వెళ్లే రైతులు, పశుపోషకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించి వాహనదారుల, రైతుల, విద్యార్థుల ఇక్కట్లు తొలగించాలి.

షేక్.బుజ్జి, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

ప్రాధాన్యత క్రమంలో రోడ్ల మరమ్మతులు చేస్తున్నాం..

దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లకు ప్రస్తుతం మరమ్మతులు మొదలుపెట్టి చేయిస్తున్నాం. కనిగిరి–సీఎస్‌పురం రోడ్డు, పెదరాజుపాలెం రోడ్డు, భైరవకోన రోడ్డు మరమ్మతులు పూర్తిచేశాం. చెన్నపునాయునిపల్లె, బీ బైలు, ఉప్పలపాడు రోడ్లుకు కూడా మరమ్మతులు చేస్తాం. రేగులచలక, గుంతచెన్నంపల్లె రోడ్లుకు ప్రతిపాదనలు పంపాం.

ఫిరోజ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సీఎస్‌పురం



చెన్నపునాయునిపల్లె వద్ద రోడ్డు ఇలా..




చిప్స్ తోలి వదిలేసిన రేగులచెలక-గుంతచెన్నంపల్లి రోడ్డు

లక్కు, కిక్కు.. ఎవరికో దక్కు !

- 3 మద్యం షాపులకు 19 దరఖాస్తులు
- గడువు పెంచినా... అంతగా పెరగని దరఖాస్తులు
- నేడు లక్కీ డిప్ ద్వారా దుకాణాల కేటాయింపు

కనిగిరిరూరల్: గీతా కులాలకు కేటాయించిన మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. సోమవారం దరఖాస్తుల లాటరీ తీయనున్న నేపథ్యంలో లక్కు కిక్కు ఎవరికో దక్కుతుందోనని వేచి చూడాల్సి ఉంది. కనిగిరి నియోజకవర్గంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పీసీపల్లి, వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాలకు ఒక్కొక్క షాపు చొప్పున మూడు మద్యం షాపులు కేటాయించారు. ఈనెల 5న దరఖాస్తుల స్వీరణ ప్రక్రియ పూర్తి కావాల్సినప్పటికి ఆశావాహుల నుంచి స్పందన లభించలేదు. ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం మళ్లీ గడువు పెంచిన సంగతి విధితమే. ప్రభుత్వం గడువు పెంచిన కనిగిరి సర్కిల్‌లో దరఖాస్తుల సంఖ్య అంతగా ఏమి పెరగలేదు. మొత్తం మూడు షాపులకు 19 దరఖాస్తులు వచ్చాయి.



కనిగిరి ఎక్సైజ్ శాఖ కార్యాలయం

లాటరీల ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు నేడే..

గీతా కులాల రిజర్వేషన్ ప్రాతిపదికన దుకాణాలు కేటాయించేందుకు ఆశావాహుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆదివారం అధికారులు పరిశీలన చేశారు. సోమవారం లాటరీ పద్ధతుల్లో రిజర్వేషన్ల వారిగా దుకాణాలను కేటాయిస్తారు. దీనికి సంబంధించి 10వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు ఒంగోలు అంబేడ్కర్ భవన్ వద్ద కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ జరుగుతుందని, లాటరీలో షాపు దక్కించుకున్న వారికి వెంటనే షాపు పెట్టుకునేందుకు లైసెన్స్ ఇస్తారని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు.

కనిగిరి సర్కిల్‌లో 3 షాపులకు 19 దరఖాస్తులు..



కనిగిరి ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలోని మూడు మండలాల్లోని మూడు షాపులకు 19 దరఖాస్తులు వచ్చాయి. సీఎస్‌పురం 1 షాప్‌కు 7 దరఖాస్తులు (గౌడ్), పీసీపల్లి 1 షాప్‌కు 3 (గౌడ్), వెలిగండ్ల 1 షాప్‌కు 9 (గౌడ్) దరఖాస్తులు వచ్చాయి. 10న సోమవారం లాటరీ ద్వారా షాపుల కేటాయిస్తారు.

– ఆర్ విజయభాస్కర్‌రావు, ఎక్సైజ్ సీఐ, కనిగిరి

చదవడం నాకిష్టంతో విజ్ఞానం



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదివితే మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని లైబ్రేరియన్ గుమ్మడి వర్ధనరాజు పేర్కొన్నారు. ఆదివారం టంగుటూరు శాఖా గ్రంథాలయంలో చదవడం–నాకిష్టం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు గ్రంథాలయంలోని పుస్తకాలు, హిందీ పద్యాలు చదివారు. ప్రతి ఆదివారం పిల్లలను చదవడం మాకిష్టం కార్యక్రమానికి పంపాలని తల్లిదండ్రులను లైబ్రేరియన్ కోరారు. పాఠకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాడీషీటర్లకు కౌన్సెలింగ్



రాడీషీటర్లకు కౌన్సెలింగ్ ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: రౌడీషీటర్లు సత్ప్రవర్తన మార్చుకోవాలని ఎస్సై మాధవరావు సూచించారు. ఆదివారం స్థానిక స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గాని, మండల కేంద్రంలో గాని వీధుల మధ్య, రోడ్లపై తాగి సేవించి అలజడులు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అంతా మా ఇష్టం..!

- ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాంగణంలో ప్రైవేట్ కార్యక్రమాలు నిషేధం
- ప్రభుత్వ నిబంధనలను కాదని ప్రైవేట్ పాఠశాల కార్యక్రమానికి అనుమతులు
- రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించిన ప్రైవేటు యాజమాన్యం



ప్రభుత్వ కాలేజీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాల కార్యక్రమం

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాంగణంలో విద్యా కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలి. దీనిపై విద్యా శాఖ నుంచి స్పష్టమైన జీఓలు జారీ చేశారు. కానీ ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో శని, ఆది వారాల్లో ఒక ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసుకున్న కార్యక్రమానికి నిబంధనలకు వ్యతిరేకంగా కాలేజీ ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారు. దీంతో సదరు ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిన అధికారి మొదటి రోజు జరిగిన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఒక్కో విద్యార్థి నుంచి వెయ్యి వరకు నగదు వసూలు చేసినట్లు తెలిసింది. దీనిపై కాలేజీ ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఎడ్యుకేషన్‌కు సంబంధించి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వచ్చని, ఆ ప్రకారం ప్రైవేట్ పాఠశాల కార్యక్రమానికి అనుమతి ఇచ్చానని తెలిపారు. ఎంఈఓ–1 కత్తి శ్రీనివాసరావు కూడా ప్రిన్సిపాల్ అనుమతి ఇవ్వడాన్ని సమర్థించారు. దీనిపై డీఈఓ ఏ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా క్రీడలకు తప్ప ఎటువంటి ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహించటానికి వీలు లేదని స్పష్టం చేశారు.

ప్రతిష్ఠ ఉత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్, బూచేపల్లికి ఆహ్వానం



ప్రతిష్ఠకు జెడ్పీచైర్ పర్సన్, బూచేపల్లిని ఆహ్వానం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో నేడు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు జరగనున్న లక్ష్మీగణపతి ప్రతిష్ఠ మహోత్సవానికి జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను ఆలయ కమిటీ, స్థానిక నాయకులు ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆదివారం చీమకుర్తిలోని వారి నివాసంలో జెడ్పీ చైర్ పర్సన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇరువురిని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ ముత్యాల నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి పలువురు వారిని కలిసి ప్రతిష్ఠకు ఆహ్వానించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జనరల్ సెక్రటరీకి సన్మానం..

వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులైన ముత్యాల నారాయణరెడ్డిని ఆదివారం రాత్రి అయ్యలూరివారిపల్లె గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ముందుగా కేక్ కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, గంట వెంకట్రామిరెడ్డి, ముత్యాల రమణారెడ్డి, సన్నపురెడ్డి శివారెడ్డి, పాలుగుళ్ల వెంకటరెడ్డి, పెద్దిరెడ్డి రామిరెడ్డి, డబుల్ రెడ్డి, జి.రమణారెడ్డి, పి.నారాయణరెడ్డి, ఎం.తిరుమలరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, బీ వెంకటనారాయణ, గంటా త్రివేణిరెడ్డి, సరేంద్ర, గంటా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళులు



క్రిష్టయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వెంకయ్య

కొండపి: మండలంలోని మూగచింతల గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు బచ్చలకోటు తండ్రి బచ్చల క్రిష్టయ్య అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ఆదివారం గ్రామానికి వచ్చి బచ్చల క్రిష్టయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డాకా పిచ్చిరెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మండల సీనియర్ నాయకులు మండవ మాలకొండయ్య, వేముల రమేష్, గ్రామ సర్పంచ్ సూర్యనారాయణ, బాలకోటయ్య, నాగయ్య, దత్తయ్య, కోటయ్య, రామాంజనేయులు, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు అందజేస్తున్న గుత్తి శ్రీధర్, చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: క్రీడా కారులను ప్రోత్సాహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, సీఐ ఎస్ కే ఖాజావలి అన్నారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ అవరణలో జరగుతున్న రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్‌లో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులకు ఆదివారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ (నేషనల్ హ్యూమన్ రైట్స్) రాష్ట్ర డైరక్టర్, ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు గుత్తి శ్రీధర్ రూ.50 వేలు విలువ చేసే దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, లాన్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ మోహన్‌రెడ్డి, సిరుపగోవర్ధన్‌రెడ్డి, న్యాయవాది సుమైర్, పసుపులేటి అరుణోధర్, అల్లూరి సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, మనోహర్‌రెడ్డి, మాకినేని నరసింహారావు, కొల్లి సురేష్ బాబు, వెలుగూరి చంద్ర,, హన్ను, బన్ను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు



అవార్డు పొందిన విద్యార్థులు

కనిగిరిరూరల్: విశ్వ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 2024–25 ఏడాదికి సంబంధించి విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో స్థానిక బోధిధర్మ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయిలో అబాకస్ పోటీల్లో జూనియర్ విభాగంలోనాలుగో తరగతి విద్యార్థి జీ రేవంత్ కుమార్, సీనియర్ విభాగంలో కే సిసింద్రినాథ్ ఉత్తమ ప్రతిభా అవార్డులు పొందినట్లు శిక్షకురాలు శిరీషా తెలిపారు. ఈమేరకు ఆదివారం విద్యార్థులను కరస్పాండెంట్ జీ రవీంద్ర, ప్రిన్సిపాల్ టీ జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నదాన సత్రానికి స్థల పరిశీలన



ఈవో, చైర్మన్‌తో చర్చిస్తున్న డీఈఈ శ్రీనివాస్

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో మహాప్రాకార నిర్మాణం, అన్నదాన సత్రం ఇతర నిర్మాణాలకు ఆదివారం దేవదాయ, ధర్మాదాయ డీఈఈ, స్థానిక ఈఓ, చైర్మన్‌లు స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా డీఈఈ సీహెచ్ శ్రీనివాస్ మహాప్రాకార మండపం, 167–బీ జాతీయ రహదారి నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో ఆర్చి నిర్మాణం, అన్నదాన భవనం, రేకులషెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు వేసేందుకు కొలతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణలు మాట్లాడుతూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎస్సై

కొండపి: దాతల సాయం అభినందనీయమని ఎస్సై ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండపిలోని మద్దులూరు రోడ్డులో గల కవనెంట్ చర్చిలో 30 మంది కళాశాల, పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై పాల్గొని బ్యాగులను పంపిణీ చేసి మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థులకు సాయం చేయడం ఎంతో మంచిదని, దాత కట్టావారిపాలేనికి చెందిన చింతల వెంకయ్య కుమారుడు వెంకట అఖిల్‌ను అభినందించారు. జిల్లాలోని కొండపి, దర్శి, సంతనూతలపాడు, టంగుటూరు, చీమకుర్తి మండలాలకు చెందిన 30 మంది పేద విద్యార్థులకు సాయం చేసిన మన ఊరి వికాసం స్వచ్ఛంద సంస్థకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. చింతల వెంకట అఖిల్ ఆర్థిక సహాయంతో గతంలో బీదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చిపాస్టర్ అంగలకుర్తి బ్రహ్మయ్య, సంస్థ కార్యదర్శి వీరమోసు మస్తానరావు, కట్టా రవికుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.